**చిన్నకథ**

# సాక్షాత్కారం



గుట్టమీద దేవుడు! గుట్ట క్రింద జీవుడు!

దేవునికీ జీవునికీ మధ్య లెక్కలేనన్ని మెట్లు!

ఒకమెట్టు మనమెక్కితే, నాలుగు మెట్లు తాను దిగి వస్తాడేమో!

గుళ్ళో దేవుడు! గుండెల్లో జీవుడు!

మనిషి దేవుణ్ణి సృష్టించాడా? లేక దేవుడు మనిషిని సృష్టించాడా?....

గుళ్ళో దేవుడున్నాడంటే, గుడి బయట లేనట్లేనా?...

ఏమిటో, ఈ బ్రతుక్కి అన్నీ ప్రశ్నలే! అన్నీ సందేహాలే!

అసలు, దేవుడు మనుష్యులకి దూరంగా ఎందుకుంటాడో తెలీదు. అలాగే, మనిషి మనిషికి దూరంగా ఎందుకుండాలనుకుంటాడో, ఎంతకూ తెలీదు.

తలపైకెత్తి చూశాను. స్వర్ణకాంతుల్తో వెలిగిపోతోంది దేవాలయ శిఖరం! మబ్బుల్లోకి తల దూర్చి చుక్కలతో ముచ్చటిస్తున్నట్లుగా ఉంది.

అందని శిఖరాల్ని అందుకునే ప్రయత్నమే మనిషి!

అసలు మనిషే ఒక అందని శిఖరం!

మెట్టు పైనుంచి, మెట్టు పైకి శరీరాన్ని మోసుకెళ్తున్నాను, ఏసుక్రీస్తు శిలువను మోసుకెళ్లినట్లు.

మనసు కోరుకునే సుఖం కోసం, ఆనందం కోసం, శరీరం పడే తంటాలెన్నో!

అసలు ఏమిటో ఈ జీవితం? ఏమిటో దీని పరమార్థం?.... జీవితమంతా చదివినా, అర్థం కాదేమో, ఈ జీవన గ్రంథం!

"భజగోవిందం! భజగోవిందం! గోవిందం భజ మూఢమతే!"

ఆదిశంకరుల కీర్తన! సుబ్బులక్ష్మీ గాత్రం!.... నవనాడులుప్పొంగుతున్నాయి! మనసు కర్పూరంలా కరిగిపోతోంది!

గాల్లో తేలిపోయే పాటకి ఎంతశక్తి?!....

మెట్ల కిరువైపులా పూలచెట్లు. పారవశ్యంతో తలలూపుతున్నాయి.

పూలు కూడా పాటని వింటున్నాయేమో!

ఓ పువ్వునా తలపై రాలి, మెట్లపై పడిపోయింది. ఎవరో భక్తులు త్రొక్కుకుంటూ వెళ్ళిపోయారు. ఎవరో పిల్లలు నవ్వుతూ చప్పట్లు చరుస్తున్నారు.

ఏమిటిది?!... సృష్టి స్థితి లయల్లోనూ ఆనందమేనా?... ఓ పిల్ల తెమ్మెర కొంటెగా నా కండువాతో ఆడుకుంటూ వెళ్ళిపోయింది. గాలివెంట మబ్బులానా కండువా సైతం వెళ్ళ జూచింది. బలవంతంగా ఆపివేశాను.

మరో వీచిక! నా ముక్కుపుటల్ని సుతారంగా మీటుతూ వెళ్ళింది! ఓహ్! కమ్మని కర్పూరపు కంపు! హారతి వెలిగించినట్లున్నారు! త్వరగా వెళ్ళాలి.

మనశ్శరీరాలు గాలిలో తేలియాడుతున్నాయి. ఎంతో హాయిగా ఉంది. మరో తెమ్మెర! ఈసారి చెవుల మీదుగా ప్రయాణం!

"ఠంగ్! ... ఠంగ్! ... ఠంగ్!"

ఆహ్!... ఎంతటి శ్రవణ ప్రేయమీ చిరు ఘంటి కానాదం?!....

దేముని
ముందు
పారవశ్యంతో
చిన్నారి ఘంటికలు
తలలూపుతున్నట్లు
న్నాయ్. భక్తుల మనోభావాలకు ప్రతి రూపాల్లా!

కాసేపు నిశ్శబ్దం!

శబ్దం నిశ్శబ్దాన్ని సృష్టించగలదా?.... అంతరాత్మను మేల్కొల్పగలదా?... ఏమో!?...

మనోవేదికపై తాండవిస్తోన్న ఆలోచనలన్నీ గమ్మత్తుగా క్షణంలో మటుమాయ మయ్యాయి! ఒక గాలి తెమ్మెరకు మబ్బులన్నీ తొలగి, గగనంలో నైర్మల్యం చోటు చేసికొన్నట్టు!

ఇప్పుడు మనస్సులో ఒకే ఒక యోచన. త్వర త్వరగా గుడికెళ్ళాలనే! గబగబా పై కెళ్ళాను. మెట్ల పైంచి నడిచినట్లుగానే లేదు. దేవాలయమే నా కడకు నడిచి వచ్చినట్లుగా ఉంది!

గుడి ముందు
మెట్టు మెట్టునా
గుడి మెట్లలా
కూచున్న యాచక జనం!

కళ్ళు వెలిగించిన హారతుల్లా, నోళ్ళు మూత బడని పేటికల్లా, శరీరాలు ఎండు పుల్లలా ఉన్నాయి!

నిజానికి, దేముని ముందు అంతా యాచకులే! కాదంటే కొందరు బయట! కొందరు లోన!

తమ ఆకుల అరచేతులు చాచిన వృక్షాల్లా ఉన్నారు!

ఒకటే యాచనల హోరు.

పాపం, కొందరికి జీవితాలే యాచక పర్వాలు!

ఈసడించుకొంటూ వెళ్తున్నారు భక్తులు

నేనూ లోనికి వెళ్ళ జూచాను.

కానీ, ముందడగు ముందుకెళ్ళే, వెనకడుగు వెనకే ఆగిపోయింది. వెనుదిరిగి చూద్దును కదా–

ఏవో రెండు లేత అరటాకు చేతులు నా పాదాల్ని బంధించి ఉన్నాయి!

కదిలిస్తే చాలు, లతా మండపంలా కూలిపోయేలా ఉన్నాడా బాలుడు!

పై కండువా జారిపోతోంది! బిళ్ళగోచీ ఊడిపోతోంది.

"అరె! ఏమిటిది?" నిలువెత్తు ఆశ్చర్యం!

ఓ ఏడాది పిల్లడు! బిచ్చగాళ్ళ పిల్లడు! నా పాదాల్ని పట్టుకు నుంచున్నాడు, చొంగ కారుస్తూ!

మొల నూలైనా లేని మృత్పిండం! కాదు అమృత పిండం! ఆ నునులేత పెదాలపై ప్రణవ నాదంలోని మొదటి అక్షరం – "ఆ... ఆ... ఆ..." అంటూ శృతి చేసుకుంటోంది!

బాలశివునికి మల్లే ఉన్నాడు. ఒంటి నిండా మట్టి! బూది! ఆసహ్యం కాదు. ఆదరణ పుట్టుకొచ్చింది.

మానవత్వం తెరలు చించుకుంది. పురులు విప్పుకుంది.

తన మూడు వరాలు–



'కూడూ, గూడూ, గుడ్డా' ... అనే తన మూడు వరాల కోసం, దేముడు మళ్ళీ వామనుడై నా ముందు అవతరించలేదు కదా?... ఏమో!...

నా కళ్ళు కరిగిపోయాయి, వేడికన్నీటి బిందువుల్ని వర్షిస్తూ... నా బుట్టలోని రెండరటి పళ్ళనీ, రెండు చేతుల్లో ఉంచాను. నాకు తెలీకుండానే!

పళ్ళకోసం చేతుల్ని చేశాడో, చేతుల కోసం పళ్ళని సృష్టించాడో దేముడు?!... ఎవరు చెప్పగలరు?....

కానీ, ఆ పసిపాప ముఖంలో వెల్లువెత్తిన ఆనందాబ్దిలో మాత్రం ఒక 'క్షీర సాగర శయనుడు' లీలగా, లీలా మాత్రంగా గోచరించాడు, చిరునవ్వుల్ని చిలకరిస్తూ!

అక్కడే... ఆ మెట్ల వద్దే... ఆ చిన్నారి పాదాల వద్దే... నా టెంకాయని కొట్టి, తీర్థాన్ని తలపై చల్లుకొన్నాను. ఆ చిట్టిపొట్టి పాదాల్ని అభిషేకించాను.

"బ్రహ్మకడిగిన పాదము. బ్రహ్మము తానీ పాదము..." గుళ్ళోంచి కీర్తన!.... అన్నమయ్య నా కోసమే వ్రాసి, నా కోసమే ఆలపిస్తున్నట్లుగా ఉంది!

ద్విగుణీకృతమైన తన్మయత్వం!

రెండుగా విడిపోయిన ఆ కొబ్బరి ముక్కల్ని ఆ పాప తల్లిదండ్రుల కిచ్చాను.

కాదు, దేవతల కందించాను!

విచిత్రం. దేవతల పాదాల్ని నేను కాదు, దేవతలే నా పాదాల్ని తాకారు! సముద్రుడు సామాన్యుడి కాళ్ళు కడిగినట్లు!

నేను వారించి, రిక్తహస్తాలతో నిండు గుండెతో, గుళ్ళో కడుగెట్టాను ఆశ్చర్యం! గుళ్ళో దేముడు లేడు! భక్తుల ముఖాల్లో ఆనందతాండవం చేస్తున్నాడు!

చేతులెత్తి, దణ్ణం పెట్టుకున్నాను, ఆ విరాట్ స్వరూపానికి!

–గన్ను కృష్ణమూర్తి

సెల్: 92472 27087